క్లుప్తంగా

కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 55, బెండ 45, కాకర 50, దొండ 30, దోస 25, ఆలు 25, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 120.

నేడు శిల్పారామంలో భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్ శిల్పారామంలో వీకెండ్ ప్రదర్శనలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తారు. గురు రూపశ్రీ మధుసూదన్ శిష్యురాలు మహిమ హరీష్ భరత నాట్య ప్రదర్శన ఉంటుంది.

నేడు 'సంత'

గచ్చిబౌలి: వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో ఆదివారం తారానగర్, గుల్‌మోహర్ పార్కుకాలనీ,నానక్‌రాంగూడ, మదీనాగూడ, గోకుల్‌ప్లాట్స్ పెద్ద చర్చి వద్ద సంతలు నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించే ఈ సంతలలో తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులు లభిస్తాయి.

నేడు హనుమాన్‌జయంతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు జరుగుతాయి. ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 8.30 గంటల నుంచి శివాలయ మండపంలో 108 సార్లు 'హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది.

టాపర్లకు అభినందనలు



హర్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రభుత్వ విద్యకు పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి గుల్‌మోహర్‌పార్కు కాలనీకి చెందిన హర్షిత చేవెళ్ళలోని మోడల్ స్కూల్‌లో బైపీసీ విభాగంలో 987 మార్కులు సాధించగా, రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు వచ్చిన నేపథ్యంలో శనివారం గాంధీని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా హర్షితను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హర్షిత తల్లిదండ్రులు వెంకటరమణ, పద్మావతి, పాస్టర్ ఏసుపాదం, శామ్యూల్ రాజు, షబానా తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు..
శేరిలింగంపల్లి: పదవ తరగతి పరీక్షల్లో సత్తా చాటిన శేరిలింగంపల్లి త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులను శనివారం కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శాలువాతో సత్కరించి అభినందించారు. పి.దీక్షితరెడ్డి 10/10, ఎంఎస్ రిత్విక, జి.మాలికలు 9.8/10 చొప్పున సాధించారు. కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో
రాయదుర్గం: సీబీఎస్ఈ ఫలితాల్లో రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను శనివారం అభినందించారు. స్కూల్‌లో టాపర్‌గా రామవరపు అభినవ పూర్ణ యశస్వి నిలువగా ఆ తర్వాతి స్థానాల్లో కునాల్ బి పాండ్యా, కాసారం సాయివైష్ణవి, విహాన్ హెచ్ రాజు, గుత్తా జ్ఞానతేజ, రామగిరి వర్షిణి, కంకణాల అనూష, షేక్ గులామ్‌మహ్మద్ సుభి, అబ్దుర్ రహమాన్‌ఖాన్, లలితా ఆదిత్యాకృష్ణన్ టాప్-10లో నిలిచిన విషయం తెలిసిందే. వీరందరినీ ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపల్ ఉషా కారుమతిల్, వైస్ ప్రిన్సిపల్ పునీత, జనరల్ కోఆర్డినేటర్ వసంత అభినందించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు



మియాపూర్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో సంకల్పము, కుంభపూజ, పంచామృతాభిషేకం, తోమాలసేవ, హోమం, అష్టోత్తర మంటపారాధన, పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో 59 జీఓ కింద 10మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు ఉండి పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు ఆ స్థలాలను రెగ్యులరైజ్ చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు.

సమస్యలతో ప్రజలు సతమతం



సురభి కాలనీలో పర్యటిస్తున్న నాయకుడు గజ్జెల యోగానంద్ తదితరులు

బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్

మియాపూర్: కాలనీ, బస్తీలలో అధికార పార్టీ నాయకులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని బీజేపీ నాయకులు గజ్జెల యోగానంద్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధి సురభికాలనీలో 47వ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం వచ్చి 8 ఏళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సురభి కాలనీలో జనం అనేక సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై మురుగు నీరు, పార్కులు, వీధి దీపాలు పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం నమ్మకం పోయిందన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి కాంచనకృష్ణ, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కోశాధికారి రమేష్ సోమిశెట్టి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళ మోర్చ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మీ, శ్రీనివాస్,సత్య, శివకుమార్, శ్రీనివాస్, బాలరాజు, రత్నకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరిణి నాట్యం



మాదాపూర్: కళాకారులు ఆంధ్ర నాట్యం, పేరిణి నాట్యంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం జనగాం నుంచి వచ్చిన పేరిణి లాస్యం, ఆంధ్రనాట్యం, గురువు పేరిణీ సంతోష్ శిష్యబృందం నృత్యాలతో అలరించారు. ఇందులో పుష్పాంజలి, వినాయక గద్యం, పేరిణి శివతాండవం,మూషికవాహన, బ్రహ్మగద్య, శబ్దపల్లవి, శంకర గిరిజ, నమోనమో నటరాజ, సరస్వతి స్తుతి తదితర అంశాలను శివప్రియ, అక్షితలాస్య, శరణ్య, శ్రద్ధ, పూజిత, అనన్య, సంవిక, దీక్షిత, అమృతవర్షిణీ, అభిలాషిని, లక్ష్మీప్రణవి, నాగశివాని, సహస్ర, రమ్య, సాత్విక్ తదితరులు ప్రదర్శించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంతో పాటు ఐలాపూర్ తండాలో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు విరివిగా జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు, కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజాము నుంచి దాదాపు 150 మంది రెవెన్యూ సిబ్బంది, 200 మంది పోలీసుల బందోబస్తు మధ్య 350 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నిర్మాణాల సమయంలో విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా, మీటర్లు ఇచ్చారని, ఇప్పుడు వచ్చి అన్యాయంగా తమ నివాసాలను కూల్చివేస్తున్నారని కొంతమంది పోలీసులుపై తిరగబడటంతో ఒకానొక సమయంలో లాఠీచార్జ్ చేసేందుకు యత్నించారు. కార్యక్రమంలో డీఎస్పీ భీమ్‌రెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి, జిన్నారం వేణుకుమార్, బీడీఎల్ సీఐ వినాయక్‌రెడ్డి, పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, అమీన్‌పూర్ తహసీల్దార్ దశరథ్, పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిట్కుల్ గ్రామానికి చెందిన సంగన్నగారి కిష్టమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. గాయపడి వివిధచోట్ల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ పరామర్శించారు. క్షతగాత్రులందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలోనూ కాంగ్రెస్ విజయం తథ్యం

శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు



హఫీజ్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు

హఫీజ్‌పేట్ : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడంతో శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హఫీజ్‌పేట్, మదీనాగూడ, మియాపూర్ చౌరస్తా, ఆదిత్యనగర్‌లలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచ కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఈ సంబురాలలో సీనియర్ నాయకులు ఇలియాస్ షరీఫ్, కాట నర్సింహగౌడ్, సలీం, హరికిషన్, ఖమర్ పాషా, జమీర్, రమేష్, సయ్యద్ బాబ, శశికాంత్, ఖాజా, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ మీడియా జర్నలిస్టులు-సవాళ్లపై వర్క్‌షాప్

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా డిజిటల్ మీడియా జర్నలిస్టుల కోసం సవాళ్లపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. సైబరాబాద్ పోలీసులు, ఎండ్ నౌ ఫౌండేషన్, తెలంగాణ స్టేట్ పోలీస్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ సైబర్‌తోపాటు భద్రత(టీఎస్‌పీసీసీ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ సమాజం, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలపై వినాశకరమైన ప్రభావాన్ని ఎలా చూపుతాయో ఆయన వివరించారు. తప్పుడు సమాచార ప్రభావం ఎలా ఉంటుందో కూడా చెప్పారు. ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ కృష్ణ , సీనియర్ జర్నలిస్టులు జహీరుద్దీన్‌అలీఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, సోమశేఖర్, రాకేష్, అనిల్, డాక్టర్ సోనియా శర్మ , సుశీల్‌రావు, సాయితేజ కావేటి తదితరులు మాట్లాడారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ



యువకుడు హుండీలో నగదు తీస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని రోజు మాదిరిగానే శుక్రవారం మూసివేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం దేవాలయానికి వచ్చి చూడగా, ఆలయంలోని ఉన్న మూడు హుండీల్లో చిన్న హుండీ పగలగొట్టి అందులో నగదును ఎత్తుకెళ్లినట్టు ఆలయ నిర్వాహకులు గుర్తించి, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ యువకుడు ఆలయ ఆవరణలో హుండీలు ఉన్నచోట తిరుగుతున్న దృశ్యాలు కనిపించాయి.

సీసీఆర్టీ సమ్మర్ క్యాంపు.. అడ్మిషన్లు ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో ఇంద్రధనుష్ పేరిట సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ఈనెల 23వ తేదీ నుండి జూన్ 02 వ తేదీ వరకు తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై , అప్లిక్యూ ఆర్ట్, పేపర్ క్రాఫ్ట్‌లతో పాటు కూచిపూడి డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, మూమెంట్, మైమ్, ఫొటోగ్రఫీ, క్లాసికల్ పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుండి 9వ తగరతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులను నిర్వహించనున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.2000. వివరాలకు ఫోన్ 9063357895, 8886333799లలో సంప్రదించవచ్చు.

నేడు కేఎస్‌పీపీ పట్టభద్రుల దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్‌పీపీ) తొలిపట్టభద్రుల దినోత్సవాన్ని గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని శివాజీ ఆడిటోరియంలో ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. పబ్లిక్ పాలసీ స్నాతకోత్సవ (పీజీ) డిగ్రీ పూర్తిచేసిన 43 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలు ప్రదానం చేయనున్నారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్, కులపతి వీరందర్‌సింగ్ చౌహాన్, ఉపకులపతి దయానంద సిద్ధవటం, కేఎస్‌పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు తదితరులు పాల్గొంటారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన యువతి (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది. అమీన్‌పూర్‌కు చెందిన ఆమె స్నేహితురాలు శుక్రవారం అంబేడ్కర్ కాలనీకి వచ్చింది. ఈ క్రమంలో ఇద్దరు మాట్లాడుకుంటుండగా, యువతి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. తిరిగి వారు ఇంటికి వచ్చే సరికి వారి కూతురు కనిపించలేదు. వెళ్లే సమయంలో తనతోపాటు సర్టిఫికెట్స్, దుస్తులు తీసుకొని వెళ్లినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కూతురి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అమీన్‌పూర్‌కు చెందిన యువతి స్నేహితురాలు కూడా కనిపించడం లేదు.

ఆర్థికసాయం



శ్రీకాంత్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న కొండా విజయ్‌కుమార్ తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల డిఫెన్స్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్రీకాంత్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ హైదరాబాద్ వ్యవస్థాపకులు కొండా విజయ్‌కుమార్ చికిత్స కోసం రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు నాగరాజు, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు సీఐకి రుణపడి ఉంటా

పటాన్‌చెరు టౌన్: కేన్సర్‌తో తండ్రి మృతి చెందగా, తల్లి పక్షవాతంతో మంచం పట్టడంతో పదో తరగతి చదివే వంశీకృష్ణ ఇంటి బాధ్యతలు తీసుకున్నాడు. స్కూల్‌కి వెళ్లకుండా టీస్టాల్‌లో పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి చదువుకు సాయంతో పాటు తల్లికి వైద్యం అందేలా చూస్తానని భరోసా ఇచ్చిన విషయం తెలిసిందే. సీఐ అండగా నిలుస్తానని హామీ ఇవ్వడంతో వంశీకృష్ణ పనిమానేసి తిరిగి పటాన్‌చెరు జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో చేరి పదో తరగతి పరీక్ష రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 8.8 జీపీఏ సాధించాడు. ఈ మేరకు విద్యార్థి వంశీకృష్ణ శనివారం పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డిని పోలీస్ స్టేషన్‌లోకలిసి కృతజ్ఞతలు తెలిపాడు.

భారత్ అభియాన్ కార్యశాల ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సాంస్కృతిక వనరుల శిక్షణ కేంద్రం) లో శనివారం స్వావలంబ్ భారత్ అభియాన్ తెలంగాణ రాష్ట్రస్థాయి కార్యశాల శిక్షణను ప్రారంభించారు. భారత్ అభివృద్ధి పథంలో వెళ్ళడానికి, ఆర్థిక స్వావలంబనకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సేవా భారతి క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ తెలిపారు. కార్యశాల శిక్షణ తరగతులలో బీజేపీ రాష్ట్రనాయకు లు రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఉపాధి కల్పన, వ్యవసాయరంగం, పాడి పరిశ్రమ, ఖాదీ, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధి అన్వేషణ మార్గా లు, దిశా నిర్దేశంపై పలువురు ప్రసంగించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

- హాజరైన లో మంత్రి తలసాని, మేయర్ విజయలక్ష్మి
- రూ.2.16 కోట్ల వ్యయంతో దేవాలయ నిర్మాణం
- నిర్మాణంలో 80 శాతం కార్పొరేటర్ సొంత నిధులు



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీరుక్మిణీ సత్యభామ సహిత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఇందు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, కల్వకుర్తి శాసన సభ్యుడు జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. వారికి కార్పొరేటర్ దంపతులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చిన్న ముదిరాజ్, బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, పటాన్‌చెరు నియోజకవర్గంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో స్వరార్చన



మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న స్వరార్చనలో భాగంగా శిఖరసౌమ్య శిష్యులు నృత్యార్చన చేసి సందర్శకులను అలరించారు. శిఖర నృత్యాలయ గురువు సౌమ్యవెంకట్ శిష్యబృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఇందులో తందనానా ఆహి, ముద్దులాడే బాలుడు, బహుళ ప్రాచుర్యం పొందిన కీర్తనలను నృత్యరూపంలో ప్రదర్శించారు. కళాకారులు పర్ణిక, భువి, శ్రీవల్లీ, తనుగ్న, చిన్మయి, సంయుక్త, షమిక, స్మితిక, సహస్ర, సాద్విత, సిందు, శుభాంగి, తనుప్రియ తదితరులు పాల్గొన్నారు. - మాదాపూర్

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఎనిమిది మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.